అరుదైన తాబేళ్లకు రక్షణగా..



అలివ్‌రిడ్లే తాబేలు



సేకరించిన తాబేళ్ల గుడ్లు

అలసట లేని వలస జీవి ఆలివ్ రిడ్లే తాబేలు. అలుపెరుగని ప్రయాణం దాని జీవన శైలి. సైబీరియా పక్షుల మాదిరిగా కేవలం సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించిన ఈ తాబేళ్లు విశాఖ తూర్పు తీరానికి చేరుకుంటున్నాయి. అరుదైన ఈ తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు అటవీశాఖ అధికారులు. ఎంతో జాగ్రత్తగా సంరక్షిస్తున్నారు.

- సాగరతీరంలో సంరక్షణ కేంద్రాలు
- 40 రోజుల పాటు రక్షణ వలయంలో గుడ్లు
- పొదిగిన అనంతరం సముద్రంలోకి తాబేలు పిల్లలు



సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన తాబేళ్ల సంరక్షణ కేంద్రం

కొమ్మాది: ఎన్నో జీవుల నివాస స్థావరం సముద్రం. వాటిలో అరుదైన జీవుల్లో ఒకటి ఆలివ్‌రిడ్లే తాబేలు. ఈ వలస జీవులు ప్రస్తుతం సంతానోత్పత్తి కాలం కావడంతో భీమిలి బీచ్ రోడ్డు సాగరతీరంతో పాటు జిల్లాలో సముద్ర తీర ప్రాంతాలకు అధిక సంఖ్యలో వస్తున్నాయి. తమ సంతానాభివృద్ధికి అర్ధరాత్రి దాటిన తరువాత తీరానికి చేరుకుంటాయి ఈ తాబేళ్లు. గుడ్లు పెట్టి వాటిని ఇసుకలో భద్రపరచి, అనంతరం సముద్రంలోకి తిరిగి చేరుకుంటాయి. తీరంలో తమకు అనువైన స్థలం పరిశీలించుకుని భారీ సంఖ్యలో గుడ్లు పెడుతుంటాయి. అయితే అలాంటి తరుణంలో కొన్ని తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్లను ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ లిస్ట్‌లో హానికి లోనయ్యే జాతులుగా వర్గీకరించారు. వాటిని సంరక్షించుకునేందుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు అటవీ శాఖఅధికారులు.

ఎన్నో ప్రత్యేకతలు

అరుదైన ఉభయచరజీవుల్లో అనేక జాతుల తాబేళ్లు ఉన్నా ఆలివ్‌రిడ్లే తాబేళ్లకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వీటికి స్థిర నివాసం అంటూ ఏదీ ఉండదు. రెండు అడుగుల పొడవు, సుమారు 300–500 కేజీల బరువు ఉండే ఈ తాబేళ్లు ఆహార అన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం దాదాపు 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వీటిల్లో ఏడు జాతులు ఉండగా 5 జాతుల తాబేళ్లు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి లక్షలాదిగా ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తీరాలకు సముద్ర మార్గంలో వలస వస్తుంటాయి. వాస్తవానికి ఈ తాబేళ్లు గూళ్లు కట్టుకునే సమయం నవంబర్ నుంచి మే వరకు ఉంటుంది. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి నెలల్లో ఇవి ఎక్కువగా గుడ్లు పెడుతుంటాయి.

50–150 గుడ్లు

సాధారణంగా ఇవి డిసెంబర్ నుంచి ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి తీరానికి వేలాదిగా వస్తుంటాయి. అర్ధరాత్రి 2 గంటల నుండి తెల్లవారు 5 గంటల సమయంలో అవి తీరానికి చేరుకుని, ఇసుకలో గోతులు తవ్వి వాటిలో గుడ్లు పెట్టి, తిరిగి వాటిపై ఇసుక కప్పి తల్లి తాబేళ్లు తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతాయి. సుమారు నెల రోజుల అనంతరం ఈ గుడ్లు పిల్లలుగా తయారవుతాయి. ఒక్కో తాబేలు 50–150 గుడ్లు పెడుతుంటుంది. 28 నుండి 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో పొదిగిన గుడ్లు మగ తాబేళ్లుగా, 30–32 డిగ్రీల ఉష్ణోగ్రతలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగా తయారవుతాయి. అయితే పిల్లలుగా మారిన వెంటనే వాటంతట అవే సముద్రంలోకి వెళ్లిపోవడం విశేషం.



తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న దృశ్యం (ఫైల్)

ప్రత్యేకంగా సంరక్షిస్తున్న అటవీశాఖ

తీరంలో తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోతాయి. అయితే, ఉదయానికి పర్యాటకులు తాకిడి వల్లనో లేదా కొన్ని జీవుల కారణంగానో గుడ్లు నశించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జాతి అంతరించిపోకుండా ఉండేందుకుగాను, ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో పలు చోట్ల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సాగర్‌నగర్ బీచ్ వద్ద సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయగా, జోడుగుళ్లపాలెం, చేపలుప్పాడ, పెదనాగమయ్యపాలెం ప్రాంతాల్లో మరి కొద్ది రోజుల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ కేంద్రాల్లో తాబేళ్లు పరిరక్షణ ప్రాజెక్టు పార్ట్‌టైం ఉద్యోగులను ఏర్పాటు చేసి, తీర ప్రాంతాల్లో విడిచి పెట్టిన ఆ గుడ్లను సేకరించి వీటన్నింటిని సంరక్షణ కేంద్రాల్లో పొందుపరుస్తారు. సుమారు 40 రోజుల పాటు రక్షణ వలయంలో ఉంచి గుడ్లు పొదిగి పిల్లలుగా మారిన తరువాత వాటిని సురక్షితంగా సముద్రంలోకి విడిచి పెడుతుంటారు. అవి బుడి బుడి అడుగులు వేస్తూ తీరంలో సముద్రంలో కలిసిపోతుంటాయి.

సంరక్షణ చర్యలు వేగవంతం

అటవీశాఖ ఆధ్వర్యంలో గతేడాది 7 వేల ఆలివ్ రిడ్లే తాబేలు గుడ్లు సేకరించి, సంరక్షించాం. వాటి పిల్లలను సురక్షితంగా సముద్రంలో విడిచిపెట్టే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశాం. ఈ ఏడాది కూడా సంరక్షణ చర్యలు వేగవంతం చేసి మరింత ఎక్కువగా తాబేళ్ల గుడ్లు సేకరించే కార్యక్రమం చేపడుతున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ మహత్తర కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకున్నాం.

– శ్రీవాణి, జిల్లా అటవీశాఖ అధికారి

ఓర్పే విలువైన ఆభరణం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- కొనసాగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలు



అనుగ్రహ భాషణం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: ఓర్పు అనేది మనిషికి ప్రధాన గుణమని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఓర్పుతో ఎంత కష్టమైన విషయాన్నైనా సాధించవచ్చనని శ్రీరామాయణం బాలకాండలో విశ్వామిత్ర మహర్షి శ్రీరాముడికి తెలియజేసి, ఎన్నో గొప్ప విషయాలు నేర్పించి సుగుణాభిరాముడిగా తీర్చిదిద్దారని తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా 4వ రోజు మంగళవారం ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఓర్పులోనే జగత్తు అంతా ఉందని, ఓర్పే దైవమని శ్రీరామాయాణం మనకి తెలియజేస్తుందన్నారు. బాలకాండలో విశ్వామిత్ర మహర్షి కుశనాభ ఉపాఖ్యానము, విశ్వామిత్రుని వంశ చరిత్ర, షణ్ముఖోత్పత్తి ఘట్టాలపై ప్రవచించారు. శ్రీరామాయణం బాగా చదువుకుని అర్థం చేసుకున్న వారికి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లతో ఎలా ప్రవర్తించాలో బాగా తెలుస్తుందన్నారు. రామాయాణం సహా భారతాది ఇతిహాసాలు కేవలం కథలు కాదని, మన నిజ జీవితంలో మనకు విలువలు, మానవీయ సంబంధాలు నేర్పే గొప్ప పాఠాలని అభివర్ణించారు. కార్యక్రమానికి చాగంటి కోటేశ్వరరావు భార్య సుబ్రహ్మణ్యేశ్వరి హాజరయ్యారు. నిర్వాహకులు అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దారుకు సత్కారం



తహసీల్దార్ ఆనందరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

పద్మనాభం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న పద్మనాభం తహసీల్దారు కాకర ఆనందరావును బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్ అభినందించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు, సిరిపురపు వెంకటరావు, మరగడ గౌరి పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారు మంగళవారం విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. పసుపు, నీలం, తెలుపు చామంతి, ఎరుపు బంతి పువ్వులతో అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు అలంకరించారు. ఈ అలంకరణకు కాగితాలపేటకు చెందిన మజ్జి సూర్యం, అన్నపూర్ణ దంపతులు సహాయ సహకారాలు అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజీవ్‌నగర్‌లో విజృంభిస్తున్న జ్వరాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇద్దరు డెంగ్యూతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఇక్కడ పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడం, దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేయకపోవడంతో జ్వరాల బారిన పడుతున్నామని ఇక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇక్కడి వారు కోరుతున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించనున్న గీతం ఎక్స్‌లెన్స్ మీట్–2025లో భాగంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, జిమ్సర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు హాజరై విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ మారికవలస జేకే లే అవుట్ 11కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ ఏఈఈ నరేష్ తెలిపారు. ఈ కారణంగా మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, బోరవానిపాలెం, మారికవలస జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బోరవానిపాలెం, బోరవాని డ్రైవర్స్ కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, జేకే లే అవుట్ పరిసర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మన రాజ్యాంగం విశిష్టతను తెలియజేయాలి

పీఎంపాలెం: మన రాజ్యాంగం విశిష్టతను నేటి తరానికి తెలియజేయాలని బీజేపీ పార్లమెంట్ జిల్లా కన్వీనర్ చక్రవర్తి సూచించారు. పీఎం పాలెంలో మంగళవారం నిర్వహించిన సంవిధాన్.. గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఎన్నో దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మన దేశానికి అనువుగా ఉండే రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంతటి మహోన్నతమైన రాజ్యాంగం గురించి భారతీయ పౌరులందరికీ తెలియాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశానుసారం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి అసెంబ్లీ కో-కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చుక్కలు చూపిస్తున్నారు

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- 55 రోజులుగా పునరుద్ధరించని సరఫరా
- ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా కానరాని స్పందన



ఎండిపోయిన బెండతోట



ఇసుకలో కూరుకుపోయిన బోరుబావి



ఎండిపోయిన గడ్డితోట

తగరపువలస: ఆనందపురం రైతులకు అక్కడి విద్యుత్‌శాఖ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం 55 రోజులుగా తిప్పించుకుంటూ అన్నదాత కంట కన్నీరు తెప్పిస్తున్నారు. వివరాలివి.. 2024 డిసెంబరు 5న ఆనందపురం పంచాయతీ సర్వే నంబర్ 139లో విద్యుత్ స్తంభాలకు చెందిన 500 మీటర్ల అల్యూమినియం వైర్లను దొంగలు కట్ చేసి ఎత్తుకుపోయారు. వెంటనే బాధిత రైతులు ఆనందపురం విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్ తీసుకురావాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే ఎఫ్ఐఆర్ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పేశారు. రైతులకు అండగా నిలిచేవారు లేక అక్కడి రైతులను 55 రోజులుగా పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు.

అధికారులకు అర్జీలెన్నో..

- రైతులు డిసెంబరు 30న కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా ఈ నెల 6వ తేదీలోగా పరిష్కరిస్తామని అర్జీ రసీదు ఇచ్చి పంపేశారు.
- ఈ నెల 21న ఆనందపురంలో జరిగిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా వినియోగదారులకు ఇబ్బంది కలిగి, 48 రోజులైనా ఎందుకు పరిష్కరించలేదని సిబ్బందిని మందలించారు.
- అధికారుల నిర్లక్ష్యంపై అదే రోజు సాక్షిలో 'ఇంత నిర్లక్ష్యమా?' శీర్షికతో కథనం ప్రచురించినా ప్రయోజనం లేకపోయింది.
- సీతమ్మధార, ప్రకాశరావుపేటలలోని విద్యుత్ కార్యాలయాల చుట్టూ కూడా తిరిగారు.
- ఈ నెల 27న మరోమారు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

కనికరించని అధికారులు

నెలరోజుల వ్యవధిలో కలెక్టర్‌కు రెండు సార్లు, విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఒకసారి ఫిర్యాదు చేసినా రైతుల పట్ల విద్యుత్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారు. కళ్లముందే పంట ఎండిపోతున్నా అధికారులు దయ లేకుండా 55 రోజులుగా తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వ పాలనలో ఉన్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు.

క్యాన్సర్ వ్యాప్తిలో మైటోకాండ్రియా పాత్రపై పరిశోధనలు



డేనీ ఆర్.వెల్ ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: చిన్న మార్పు కలిగినా, శరీరంలో ఉండే మైటోకాండ్రియాను కణానికి శక్తిని అందించే పవర్ హౌస్‌గా విశ్వసిస్తారని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ క్యాన్సర్ సెంటర్ (యూఎస్ఏ) పరిశోధకుడు ప్రొఫెసర్ డేనీ ఆర్. వెల్ అన్నారు. అయితే క్యాన్సర్ వ్యాపించే అవకాశాన్ని నిర్ణయించడంలో మైటోకాండ్రియా కీలక సమాచారం కలిగి ఉంటుందని తమ పరిశోధనల్లో వెల్లడైందన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్ర విభాగం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ సంబంధిత మరణాల్లో మెటాస్టాసిస్ ప్రధాన కారణమని వివరించారు.

చంద్రంపాలెం విద్యార్థులకు స్టడీ మెటీరియల్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, దివీస్ ప్రతినిధులు

మధురవాడ: జీవితంలోనే కీలకమైన 10వ తరగతి పరీక్షలను బాగా రాసి, చక్కని ఉత్తీర్ణత శాతం తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్ కుమార్ ఆకాంక్షించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు 800మందికి చిప్పాడ దివీస్ లేబోరేటరీ యాజమాన్యం సుమారు రూ.2 లక్షలతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పాఠశాలలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోమంది నిష్ణాతులైన ఉపాధ్యాయులు తయారు చేసిన ఈ మెటీరియల్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవి, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్, ఉపాధ్యాయులు సోమయాజులు, శ్రీను, నాగేశ్వరరావు, రత్నరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు



కత్తెర పురుగు గురించి రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ భీమిలి సహాయ సంచాలకుడు బి.వి జయప్రసాద్, మండల వ్యవసాయాధికారి బి.శివ కోమలి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న, రాగి, నువ్వులు, వరి సాగవుతున్నాయన్నారు. అక్కడక్కడ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గుర్తించినట్టు తెలిపారు. దాని నివారణకు వాడాల్సిన మందుల గురించి తెలియజేశారు. రైతులకు వైఎల్ఎం–66 రకం నువ్వుల విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందించారు. మొబైల్‌లో ఎన్‌పీఎస్ఎస్ అనే యాప్ నమోదు చేసుకోవడం ద్వారా తెగుళ్లు, పురుగులు గుర్తించి సలహాలు ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది వాసంతి, రమేష్, హరీష్, రమేష్, కృపామణి తదితరులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు సూచనలు



ఛాత్రోపాధ్యాయుల బోధనను పరిశీలిస్తున్న అధ్యాపకుడు త్రినాథరావు

తగరపువలస: భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల, 4వ వార్డు జేవీ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయుల బోధనలను పరిశీలించారు. విద్యార్థులకు బోధించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఛాత్రోపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శింపచేశారు. తరళ బోధనను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమాధానాలు రాబట్టారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన తాజుద్దీన్ బాబా జయంత్యుత్సవాలు




దర్బారులో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తాజి రెడ్డిబాబా

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయ్యమ్మ సత్రం కూడలిలోని ఆశ్రమంలో మూడురోజుల పాటు జరిగిన తాజుద్దీన్‌బాబా 164వ జయంతి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా ధ్వజం వద్ద, దర్బారులో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. అనంతరం ఖవ్వాలీ నిర్వహించారు. చివరి రోజు కూడా వేలాది మంది భక్తులు బాబా దర్బారును సందర్శించి, అన్నప్రసాదాలు స్వీకరించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్బారును సందర్శించి, రెడ్డిబాబా ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ట్రస్టీలు మహమ్మద్ సాహెబ్, డి.రాజు కుమందన్, మహమ్మద్ అస్లాం, వి.త్రిమూర్తి తదితరులు సహాయ సహకారాలు అందించారు.

చెరువులా వెల్లంకి సర్వీస్ రోడ్డు



రవీంద్రభారతి స్కూల్ వద్ద సర్వీస్ రోడ్డుపై మురుగునీరు



నారాయణ స్కూల్ వద్ద ఏకమైన డ్రైనేజీ, సర్వీస్‌రోడ్డు



శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: జాతీయరహదారిని ఆనుకుని ఆనందపురం మండలంలోని వెల్లంకి పంచాయతీలో సర్వీస్ రోడ్డు కిలోమీటరు మేర చెరువులా మారిపోయాయి. వెల్లంకి గ్రామం ముఖ ద్వారం నుంచి రవీంద్రభారతి, నారాయణ స్కూల్ మీదుగా డ్రైనేజీలు పూర్తిగా పూడుకుపోయి, వాటిపై సిమెంట్ శ్లాబులు పగిలిపోయాయి. దీంతో డ్రైనేజీలలోని మురుగునీరు సర్వీస్ రోడ్డుపై చేరిపోయింది. చాలావరకు బురదగా ఉండటంతో ఈ రెండు కార్పొరేట్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఈ మురుగులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ సర్వీస్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు, ఆటోలకు ఈ మురుగు తీవ్రమైన సమస్యగా మారింది. డ్రైనేజీలకు పూడిక తొలగించి, మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

దివీస్ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం

తగరపువలస: పశువైద్య శిబిరాల ద్వారా పశు సంవర్ధకశాఖ వైద్యులు, అధికారుల సూచనలు పాటించి పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుందామని భీమిలి మండలం చిప్పాడ సర్పంచ్ వెంపాడ రమావతి కోరారు. నమ్మివానిపాలెంలో దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీలో పాలసేకరణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలు, పశువుల బీమా గురించి తెలియచేశారు. మైక్రోస్కోప్ ద్వారా పశువుల మల పరీక్షలు జరిపి, మందులు అందించారు. ఈ సందర్భంగా 72 ఆవులు, 21 గేదెలు, 360 గొర్రెలు, 251 మేకలు, 10 కుక్కలు, 96 పౌల్ట్రీ జాతులకు చికిత్స అందించి రూ.80 వేల విలువైన మందులు అందించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడీ వెంకటరమణ, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహారావు, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తిని సత్కరిస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం: విశాఖ జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ల గెజిటెడ్ అధ్యాపకుల సంఘ అధ్యక్షునిగా భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను అభినందించారు. శాలువాతో సత్కరించారు. గతంలో మూడు సార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన మళ్లీ ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.